# లాభనష్టాలు

సర్జన్ దేవీప్రసాద్ మరునాటి ప్రోగ్రామ్ చూసుకుంటున్నాడు. అసిస్టెంటు దగ్గరుండి వివరాలు చెబుతున్నాడు. ఉదయం తొమ్మిది గంటలకు మొదలుపెట్టి నాలుగు ఆపరేషన్లు చెయ్యాలి. పేర్లతోసహా లిస్టును పదే పదే చూస్తున్నాడు. మొదటిది కడుపులో కణితి. రెండవది ఎపెండిసైటిస్. మూడవది గాల్‌బ్లాడర్లో రాళ్లు తియ్యాలి. నాలుగవది మెడకు దగ్గరగా వెనకవైపున పెరిగిన గడ్డను తీసెయ్యాలి.

రోగులకు సంబంధించిన రిపోర్టులన్నీ మళ్ళీ ఒకసారి పరీక్షగా చూశాడు.

''రేపు పొద్దున నేను వచ్చేటప్పటికి థియేటర్‌ను సిద్ధం చెయ్యమని థియేటర్ నర్సుతో చెప్పు. మత్తులందిచ్చే డాక్టర్‌కి ఫోనుచేసి టైమ్ చెప్పు. సాయంత్రం ఇద్దరు పేషంట్లకు మైనరాపరేషన్లు చెయ్యాలి." అసిస్టెంటుతోచెప్పి కారు డ్రైవ్ చేసుకుంటూ ఇంటికి వెళ్లాడు.

దేవీప్రసాద్ స్వదేశంలో చదువుకుని, విదేశాలలో డిగ్రీలు డిప్లొమాలు పొంది, సర్జరీలో మంచి అనుభవం గడించిన డాక్టరు. అతడు తిరిగి స్వదేశానికి వచ్చినతరువాత నర్సింగ్‌హోమ్ పెట్టుకున్నాడు. అతడి హస్తవాసి మంచిదన్న పేరు ఆ ఊర్లోనే కాకుండా ఆ చుట్టుప్రక్కల ఊళ్లకుకూడా పాకింది. అతడి చేతనే ఆపరేషన్ చేయించుకోవాలని గ్రామాలనుండి బస్సులలోను ఎడ్లబండ్లలోను రోగులు వస్తారు.

అతడు రోగులను ఆప్యాయంగా భుజంతట్టి పలకరిస్తూ "నీకేం భయం లేదు. నీ బాధ నాబాధనుకో, ఇంక నీవు నిశ్చింతగా ఉండు'' అని అభయమిస్తూ ''హాయిగా ఈ రాత్రికి నిద్రపో'' అని అంటుంటే, ఆ మాటమాత్రానికే వాళ్ళకు జబ్బు సగం తగ్గినట్లనిపిస్తుంది. మనసులో పేరుకుపోయిన భయమూ ఆందోళనా మటుమాయమైనట్లనిపిస్తాయి. "ఇంక ప్రాణభయం లేదు" అన్న ధైర్యం కలుగుతుంది

అతడు మామూలు మనిషేనని ఆ రోగు లనుకోరు.

వాళ్లదృష్టిలో అతడు ఒక దేవతామూర్తి.

ఆయన కనబడినప్పటినుంచీ ఒకటే దణ్ణాలు పెడతారు.

''నీకు నొప్పిగా ఉంటే ఈమాత్ర వేసుకో, తగ్గిపోతుంది'' అని అతడంటే రోగులు మాత్రవేసుకోకుండా చేతిలో పట్టుకుంటారు. దీనిని చూడగానే నొప్పి తగ్గకపోయినా తగ్గినట్లనిపిస్తుంది. వాళ్లను వదలించుకు రావటానికే ఒక గంటకు పైగా పడుతుంది అతడికి.

డాక్టరు మధ్యాహ్నం ఒకటిన్నరకు ఇంటికి వచ్చి భోజనం చెయ్యగానే మేడమీదికి వెళ్ళి మంచమ్మీద వాలాడు. పక్కనే ఉన్న టీపాయిమీద పత్రికలోని హెడ్డింగ్సు చూశాడు. మెడికల్ జర్నల్సు తిరగవేశాడు.

మధ్యాహ్నపు వేళల్లో కరెంట్ కోత. కాని మేడమీది కిటికీ ఎత్తుకు పెరిగిన చెట్లు, చల్లటిగాలి వీచి, కరెంట్ లేని కొరతను తీరుస్తున్నాయి. వరసగా ఉన్న నాలుగు కిటికీలలోనుంచి వచ్చే ఆ గాలితో గదంతా చల్లటి వాతావరణం ఆవరించు కుంది. కరెంటుతో విసురుగా వచ్చేగాలి కాదది. ఏపుగా పెరిగి, ఆకులతో వెలు తురులేకుండా చేస్తున్న ఆ చెట్లు వీచే సహజమైన చల్లటిగాలి, అతడికి ఉదయం నుండీ పడిన శ్రమనుండి సేదతీరుస్తున్నది.

కళ్లు వాటంతట అవే మూతలుపడ్డాయి. ఆ మూతలు పడటం నిద్రకోసం కాదు. తన పలకరింపులతో మాటలతో శ్రమను కాసేపటిలో పోగొట్టిన శమంతక మణి స్మృతులను జ్ఞాపకం చేసుకోవటం కోసం. "నాకు చెప్పకుండా వెళ్ళి పోయావు కదూ ?"

శమంతకమణి.

తను ఏరికోరి చేసుకున్న అర్ధాంగి. తన ఉనికితో ఆమె కల్పించే ప్రశాంత వాతావరణాన్ని అతడెక్కువకాలం అనుభవించలేదు. మొదటి కాన్పుకే కన్ను మూసింది పుట్టిన బిడ్డను చూసుకోకుండానే.

ఆ బిడ్డను అతడూ చూడలేదు. శమంతకమణి ఇక లేదన్న వార్తవిని మనశ్శాంతికోసం విదేశాలకు వెళ్ళి తిరిగి వచ్చాడు.

సుమారు నాలుగుగంటలకు భార్య సుమతి కాఫీ, మలబారు అరటికాయ చిప్స బల్లమీద పెట్టి అతడిని పిలిచింది.

ఇద్దరూ బల్లకు అటొకరూ ఇటొకరు కూర్చున్నారు.

"నీవెప్పుడొచ్చావు? నేను వచ్చినప్పుడు నీవు కనబడలేదే?'' పలకరింపుగా ప్రశ్నించాడు.

"నేను వచ్చేటప్పటికి ఇంటిముందర కారుంది. ''అయ్యగారు భోజనంచేసి పైకివెళ్లార''ని నౌకరు చెప్పాడు. విశ్రాంతి తీసుకుంటున్నారు కాబోలనుకుని, నేను కిందనే ఉండిపోయాను. అంటే ఒకనిద్ర తీశాననుకోండి'' అంది కాఫీ కప్పులో పోస్తూ.

"ఈ మలబారు అరటికాయచిప్స రుచిఅంతా వేపుడులోనే ఉంది" అంటూ నాలుగు చేతిలోకి తీసుకుంటూ, "నాకు రేపు ఉదయం నాలుగు ఆపరేషన్లు ఉన్నాయి. ఇంటికి ఆలస్యంగా వస్తానేమో ? అన్నట్టు ఇవాళ నీవు ఎన్ని పురుళ్ల పోశావు ?'' ఆమెకు పురుళ్లంటే విసుగూ ఎగతాళి, వాటిని స్ఫురింపచేస్తూ ఆమె ముఖంలోకి చూశాడు.

''అబ్బబ్బ, ఎన్నిపురుళ్లు ? ఎన్నిపురుళ్లు ? వెళ్ళినప్పటించీ మళ్ళీ యింటికి వచ్చేవరకూ పురుళ్లే, వ్యవధిలేకుండా. పెద్ద క్యూలో స్ట్రెచర్లమీద ఉంటారు. ఇవ్వాళ్టికివాళ తొమ్మిది గంటలనుంచీ ఒంటిగంట వరకూ థియేటర్లో నిలబడే ఉన్నాను. ఒకదాని తరువాత ఒకటి- పదకొండయ్యాయి. ఇంకా సాయంత్రం, రాత్రికి ఎన్నవుతాయో ? ఫామిలీప్లానింగ్ ప్రచారం ముమ్మరంగా సాగుతున్నప్పటికీ ఎంతమంది పిల్లలు పుట్టుకొస్తున్నారో చెప్పలేను. వీళ్ళందరికీ తిండి ఎక్కడి నుంచి ? బట్టలెక్కడినుంచి ? ఎక్కడ ఉంటారు ? వాటిమాట తలపెట్టకుండానే పురుళ్లకు వస్తారు జనం."

ఆమె విసుగుదలచూసి అతడు మనసులోనే నవ్వుకున్నాడు.

''ఫామిలీప్లానింగ్ యూనిట్ మెటర్నిటీవార్డు పక్కనే ఉందిగా?" అన్నాడు చిప్స నములుతూ.

"ఉంది. ఉంటేఏం ? ఆపరేషన్ చేయించుకున్న వాళ్లకు ప్రభుత్వం డబ్బు ఇస్తోంది. మగవాళ్లకు ఉద్యోగాలలో ఇంక్రిమెంట్సుకూడా లభిస్తున్నాయి. ప్రచారం

తక్కువైయిందా, అంటే, మహిళాసంఘాలు బాగా ప్రచారం చేస్తున్నాయి. కొన్ని చోట్ల ఇంటింటా ప్రచారం జరుగుతోంది. వీథినాటకాలు, బుర్రకథలు, రేడియో టీ.వీల లఘునాటికలు అబ్బ, ఎంతముమ్మరంగా జరుగుతోంది ప్రచారం?''

''ఊఁ. ఇంకా ప్రజలకు కనువిప్పు కాలేదంటావు?" కాఫీ మధ్య మధ్య సిప్ చేస్తున్నాడు దేవీప్రసాద్.

కొంతసేపు మౌనం బల్లదగ్గర.

"జనాభా పెరిగిపోతున్నమాట నిజమే కాని, రైలు ఏక్సిడెంటు మరణాలు, విమానాలు కూలిపోయినప్పటి మరణాలు, బస్సులు బోల్తాపడి చనిపోయినవాళ్లు, జల ప్రళయంవల్ల చనిపోయినవాళ్ళు, మత, కుల, వర్గపోరాటాలలోని మరణాలు. కక్షలూ కార్పణ్యాలతో చంపబడిన మరణాల సంఖ్యా, సహజమైన చావులూ, ఇలా ఎన్నో జరుగుతున్నాయికదా ? ఈ పుట్టిన బిడ్డలందరు పెరిగి పెద్దవాళ్లవుతున్నారంటావా ? అజ్ఞానం వల్ల, సరియైన చికిత్సలేక ఎంతమంది పిల్లలు చనిపోతున్నారు? జనాభా సంఖ్యలోనుంచి జననష్టాన్ని తీసివెయ్యి" అన్నాడు.

"అయినా పుట్టినంత మంది చస్తున్నారా ?" అంది.

''సరే. నీమాటే రైటనుకుందాం. అసలు ఈ లెక్కలు ఎవరయినా చూస్తున్నారా ? పోనీ, ఆమాట వదిలెయ్యి. అందరూ వచ్చి పురుళ్లపోయించుకోవటానికి కాకపోతే మెటర్నిటీ హాస్పిటల్సు ఇన్ని ఎందుకు ? ఇవికాక ప్రైవేట్‌వి ఎన్ని ? మీరంతా బహుళసంఖ్యలో ఎందుకు ? ఆరోగ్య సూత్రాలూ టీకాలూ మందులూ ఎందుకు ?'' దేవీప్రసాద్ ఆమెతో వాదించి రెచ్చగొడుతూ ఉంటాడు. అదొక సరదా అతడికి.

''అడిగారూ ఈ ప్రశ్న ? వినండి. ఎందుకంటే, ఒకరినో ఇద్దరినో కంటే వాళ్ళకు వైద్యసౌకర్యాలు కల్పించటానికీ, ఉన్న జనాభా ఆరోగ్యవంతంగా ఉండటానికీ, శిశుమరణాలూ బాలెంత మరణాలసంఖ్య తగ్గించటానికీ నెలకొల్పబడ్డాయి. అంతేగాని, ఎంతమంది డాక్టర్లున్నా ఊపిరాడని పని కల్పించటానికా ఇంత జనాభా?"

''పోనీ-నీ ఉద్దేశ్యంలో ఎంతమంది పిల్లలుండాలంటావు? ప్రభుత్వం వారి స్లోగన్సు వదిలిపెట్టు నీ మాట చెప్పు?"

ఎర్రబడిన ముఖం ఇంకా మామూలుగా కాలేదు. ఉద్రేకంతో వాదించటం వల్ల ఒళ్ళంతా చెమటలు పోశాయి-సుమతికి.

"అలిసిపోయావు, కాస్త విశ్రాంతి తీసుకునిచెప్పు. తొందరలేదు'' డబ్బాలో నుంచి మరికొన్ని చిప్సు ప్లేట్‌లో వేసుకున్నాడు.

"నామాటా? నా ఉద్దేశ్యమా?"

''రెండూను"

సాలోచనగా కళ్ళు గుండ్రంగా తిప్పింది.

అతడామెవంకే చూస్తున్నాడు.

ఆమె సన్నగా పొడుగ్గా ఉంటుంది. చూడగానే వయసుకనబడని ఆకారం. తెల్లటి ఫాలభాగమ్మీద ఎర్రటిబొట్టు పెట్టుకుని, నున్నగాతలదువ్వుకుని తలవెంట్రు కలు ముడివేసుకున్నట్టుగా కట్టుకుంటుంది. నిండుగా చీరకట్టుకుని విదేశాలలో పెరిగినప్పటికీ పదహారణాల ఆంధ్రులయింటి ఆడబడుచులా ఉంటుంది. మంగళ సూత్రాలూ నల్లపూసలూ ధరించటంవల్ల వివాహితఅని చూడగానే తెలుస్తుంది. ఆమెనుచూసి డాక్టరని ఎవరూ అనుకోరు. విద్యావతిఐన గృహిణి అనుకుంటారు. ఇంటినితీర్చి దిద్దుకుంటుంది. తను డాక్టరు కనుక డాక్టరే కావాలని దేవీప్రసాద్‌ను పెళ్ళిచేసుకుంది.

''ఏమిటి? అంత చిన్నప్రశ్నలకు ఇంతసేపు ఆలోచనా? అదేమంత చిక్కు ప్రశ్నఅని?'' కన్నార్పకుండా చూస్తున్నాడు.

''ఆలోచిద్దాం. నేనింకా ఒక నిశ్చయానికి రాలేదు. పిల్లలుఅనగానే-నాకంటి ఎదుట-పిల్లలకు జబ్బుచేస్తే ఆందోళనపడే తల్లులూ, వాళ్ళకు సరైన ఆహారం ఇవ్వలేక పోయామని వాపోయే తల్లులూ, ఆరోగ్యవంతంగా పెంచటానికి తగిన డబ్బులేదని దిగులుపడే తల్లులూ, పెద్ద చదువులు చెప్పించి లక్షల ఆస్తిని వాళ్ల కివ్వాలని తాపత్రయపడే తల్లులూ, పిల్లలు చనిపోతే ఏడ్చే తల్లులూ-ఇలాంటివాళ్లు ఎందరో-ఎందరో నా కళ్ళముందర ప్రత్యక్షమవుతారు. ఆ బాధలు పడే తల్లులను చూస్తుంటే నా కడుపు చెరువయిపోతుంది. మతి పోతుంది. ఈ కష్టాలు కొని తెచ్చు కున్నారా అనిపిస్తుంది''

"అందుకని నీకు పిల్లలు ఇష్టంలేదంటావు. అంతేనా?"

ఆమె తలదించుకుంది.

''మనదేశంలో ఏ స్త్రీ కూడా పిల్లలు వద్దనుకోదు. అరటిచెట్టు ఒక గెల వేస్తుంది. అయినా దాన్ని కదళీవంధ్య అంటారు. కాకి రెండుగుడ్లు పెడుతుంది. అయినా దాన్ని కాక వంధ్యఅంటారు. అసలే పిల్లలుపుట్టరనుకో. దానికి వంధ్యాత్వ మంటారు పిల్లలే సంపద. దాంపత్యానికి పరిపూర్ణత వాళ్ళవల్లనే కలుగుతుంది.

''అంటే?'' అంది.

''మాతృత్వములోనే స్త్రీకి పరిపూర్ణత ఉందని భారతీయుల నమ్మకం. డజన్లకొద్దీ పిల్లలను కనమనికాదు దాని అర్థం. ఒకరూ లేక ఇద్దరూ. పరిమిత సంఖ్యలోనే.''

"ఇంతకూ మీ ఉద్దేశ్యం?''

''నా ఉద్దేశ్యంకాదు నేను చెప్పింది. వివాహధర్మంలోని పరమార్థాన్ని చెప్పాను. నేనడిగింది నీ సంగతి''

ఆమె అతడి ముఖంలోకిచూస్తూ గుడ్లు గుండ్రంగా తిప్పింది. మాటలు చాలించి ముఖం తిప్పుకుంది.

"డాక్టరమ్మా. మనం కాఫీ సిప్‌చేస్తూ చిప్పునములుతున్నాము'' ప్రస్తుత కర్తవ్యాన్ని జ్ఞాపకంచేశాడు.

ఆమె చప్పున కాఫీ కప్పుచేతిలోకి తీసుకుంది. అప్పుడే సుషుప్తావస్థ నుండి మేలుకున్నట్టు.

ఆమె మనస్సులోకి మరోఆలోచన రాకుండా అతడు ఆమె కిష్టమైనజోక్సు వేస్తూ కబుర్లలోకి దింపాడు.

ఆమె ముఖం వికసించింది.

''చూడు జీవితమంతా దాంపత్యంలో నవ్వులూ కేరింతలూ ఆకర్షణలూ ఉండవు. దంపతుల మధ్య ఉండే అనుబంధాన్ని పెంచేవారు పిల్లలు. పిల్లలవల్లనే జీవితంలో నిజమైన మమతానురాగాలను పెంచుకుంటారు దంపతులు.''

''హాఁ సరే సరే'' అంటూ లేచింది.

మరునాడు దేవీప్రసాద్ థియేటర్ బట్టలు ధరించి లోపలికి వెళ్ళాడు. లిస్టు తీసుకుని పేర్లు చదువుతున్నాడు. దాన్ని పక్కకుపెట్టి నెంబరువన్ ఆపరేషన్ చేశాడు. అది గంటన్నరకుపైగా పట్టింది. మిగతా మూడు ఆపరేషన్లూ అలవాటు చొప్పున గబగబా చేశాడు. థియేటరు బైటికివచ్చి బట్టలు మార్చుకుని ఆ క్రిందటి రోజు ఆపరేషన్ చేసినవాళ్ళను చూడటానికి బయలుదేరాడు. ఒక్కొక్కరినీ ''ఎలాఉంది? బాధ తగ్గిందా?'' అంటూ కుశల ప్రశ్నలువేశాడు. వాళ్ళపేర్లు ఊళ్ళూ వృత్తులు అడిగి తెలుసుకున్నాడు.

"పది రోజులయిన తరువాత మీరు మామూలు స్థితికివస్తారు. రెండు నెలల లోపే మీ మీ పనులు హుషారుగా చేసుకోగలుగుతారు. ఇంక నవ్వుముఖాలు పెట్టండి." అంటూ ఒక్కొక్క మంచమే దాటుతూ వెళ్ళాడు.

దేవీప్రసాద్‌కి ఒక అలవాటు. ఆపరేషను అయిన మరునాడు రోగులను ఎట్లాఉందని పలకరిస్తూ కుశలప్రశ్నలు వేయటం ఆత్మీయంగా పలకరించటం.

వెళ్ళుతూ వెళ్ళుతూ ఒక రోగిని "నీ పేరు?" అడిగాడు.

"శ్రీరాములు"

''ఏ ఊరు? ఏంచేస్తూ ఉంటావు?''

"నాకు ఏడంతస్తుల బిల్డింగుఉంది. కింద ట్యుటోరియల్ కాలేజిపెట్టాను. కింది దానిలోనే ఒక పక్కకు నేనుంటాను. పైఫ్లాటులన్నీ అద్దెకిచ్చాను.

''అయితే పెద్ద ధనికుడవే. ఏ ఊరు?''

''అసలు ఊరు చీపురుపాలెం''

ఊరిపేరు వినగానే దేవీప్రసాద్ ముఖంలో రంగులుమారాయి. పైకి సర్దు కుంటూ ''అదేంఊరయ్యా! చీపుళ్ళమ్ముతారా అక్కడ?'' అన్నాడు ముఖానికి నవ్వుపులుముకుని.

"ఆ ఊళ్ళో సుబ్బాయమ్మగారనే ఆమె ఉండటగా, బాగుందా?"

''ఆమె చనిపోయి ఏడాదయిందండి. ఆమె ఒక పిల్లవాడిని పెంచుకుని

చదువుచెప్పిస్తూ ఉండేది. ఆ ఊళ్ళో ఉన్నంతవరకూ చదివించి, పట్నం తీసు కెళ్ళిందండి పైచదువులకు. అక్కడే చనిపోయిందండి''

''పట్నం అంటే ఏఊరు? ఈ దేశంలో చాలా పట్నాలున్నాయి. ఏ పట్నం?''

''చెన్నపట్నమండి.''

''ఆ అబ్బాయి పేరు తెలుసా?"

"సుబ్బాయమ్మగారు చనిపోయినతరువాత అతడు చీపురుపాలెంవచ్చి ఇల్లూ పొలం అమ్మి వెళ్ళాడండి."

''నేనడిగింది అతడి పేరు.''

"అదంతా నేను కొన్నానండి. అందుకని పేరు తెలుసు పినాకపాణి"

''న్యాయమైన ధరకే కొన్నావా?"

''నేను పిల్లలు గలవాడినండి. ఊరందరినీపిలిచి ధర కట్టించి మరీ కొన్నా నండి. పాపం, ఆ అబ్బాయి అసలే తల్లిదండ్రీలేనివాడు. పెంచిన సుబ్బాయమ్మ చనిపోయింది. అతడిని అన్యాయంచేస్తే నా పిల్లలకు రేపు అన్యాయంజరగదాండి''

''మొత్తానికి అతడికి న్యాయంచేశావంటావు.''

అలాగే ఆ హాల్లోని రోగులను ఆప్యాయంగా పలకరించి ''మీరు జాగ్రత్తగా డాక్టరూ నర్సులూ చెప్పినట్టు వినండి. తొందరగా ఇళ్ళకు వెళ్ళుదురుగాని'' అంటూ వాళ్ళను నవ్వించి వెళ్ళాడు.

ఆ రోజు దేవీప్రసాద్ ఇంటికి వచ్చేసరికి రెండు గంటలయింది.

సుమతి తొందరగా ఇంటికివచ్చింది. దేవీప్రసాద్ కోసం ఎదురుచూస్తూ పేపరుతిరగేస్తున్నది. సాధారణంగా వాళ్ళిద్దరూ ఒకరికోసం ఒకరు ఎదురుచూడరు. కాని-అనాడామె మనసు ఆమె దగ్గరలేదు-హాస్పిటల్లో జనరల్ వార్డులో బెడ్‌నెం. 15 మీద నిలిచింది. ఆమెకది మొదటికాన్పు. ఆలస్యంగా తీసుకువచ్చారు. ఎన్ని విధాల ప్రయత్నించినా బిడ్డను సజీవంగా తల్లికి చూపించలేకపోయింది. తల్లికి అపరేషన్ చేయవలసి వచ్చినందువల్ల మరో కాన్పుకు అవకాశం లేకుండా పోయింది. ఈ సంగతి విన్న బాలెంత ఎడతెగని ఏడుపు ప్రారంభించింది.

''నీవీస్థితిలో ఏడవకూడదమ్మా. అలసిపోతావు. మీ వాళ్ళెవరైనావచ్చారా?'' అడిగింది సుమతి.

''అమ్మ వచ్చింది. ఈ మాటవింటే ఆమె ఇంకా ఏడుస్తుంది. అమ్మా డాక్టరమ్మా. ఇంకేమీ ఉపాయం లేదా తల్లీ?''

''లేదు. లోకంలో ఎందరికో పిల్లలు పుట్టరు. కొందరికి పుట్టినా దక్కరు. మన చేతిలో ఉన్నపనికాదది. నీవు ధైర్యంతెచ్చుకో. ఆపరేషన్‌చేసి కుట్లువేశాను. జాగ్రత్తగా ఉండాలి.''

"ఏడవక ఏంచెయ్యనుతల్లీ. పుట్టినబిడ్డ చనిపోయాడు. మళ్ళీ కాన్పు లేదంటున్నారు. ఇంక నా సంసారం కూలిపోయినట్టే. ఇప్పటికే మా అత్త, నాకు పిల్లలు పుట్టటం ఆలస్యమైందని మా ఆయనకు రెండోపెళ్ళి ప్రయత్నాలు ప్రారంభం చేసింది. ఈ మాటవింటే తన కొడుక్కు రేపే పెళ్ళి ప్రయత్నాలు చేస్తుంది. ఈనాటివరకు మా ఆయనతో సంతోషంగా కాపరంచేస్తున్నా. పిల్లో పిల్లవాడో పుడతాడని తల్లీ కొడుకులు నెమ్మదిగా ఉన్నారు. కాని-ఇప్పుడు? పిల్లల ఆశలేదు కదా? ఎంతమంచి వాడయినా ఆయనకూ పిల్లలు కావాలన్నఆశ బాగాఉంది. మళ్లీ పెళ్ళి చేసుకోకుండా ఉండడు'' వెక్కివెక్కి ఏడుస్తున్నది.

డాక్టరు సుమతి నిద్రపోవటానికి ఒక ఇంజక్షను ఇప్పించింది. కాసేపటిలో బాలెంత కళ్లు మూతలు పడ్డాయి.

ఇంటికి వచ్చినా సుమతికి ఆమే కళ్లకుకట్టినట్టు కనబడుతోంది. ఆమె లేచి మళ్ళీ ఏడుస్తుందేమో ?

అబ్బ ఏమి ఏడుపులు ? ఎన్నిరకాలు ?

సోఫాకు తల ఆనించి కళ్ళు మూసుకుంది.

అరగంట తరువాత దేవీప్రసాద్ వచ్చి చేత్తో తట్టి లేపాడు. "భోజనం చేశావా ?"

ఆమె దిగ్గున లేచింది -అతడి స్పర్శకు. కళ్లనులుపుకుంటూ నిలబడి "ఇంకాలేదు''.

"నాకోసం ఎదురుచూడద్దని చెప్పానుగా ? ఎంతసేపయింది వచ్చి ?''

"ఒంటిగంటకే వచ్చాను. ఏమిటో బద్ధకంగా ఇక్కడే కూర్చుండి పోయాను.''

''బట్టలు మార్చుకుని రా భోజనంచేద్దాం. అనుకోకుండా నాక్కూడా ఇవాళ ఆలస్యమైంది.''

ఇద్దరూ భోజనాలు చేశారు. హాస్పిటల్ వాతావరణం మనసుల్లోంచి పోనట్లుగా ఇద్దరికీ మాటలు కరవయ్యాయి. అత్యవసరమైన మాటలు ఏవో మాట్లాడుకుని పడకలు చేరారు విశ్రాంతికోసం.

కాని, మనసులకు విశ్రాంతి లేదు.

సుమతికి బాలెంత ఏడుపు ఇంకా వినబడుతునే ఉంది. "పిల్లలు పుట్టక పోతేనేం ? ఆమె మళ్ళీ పెళ్ళిచేసుకోవచ్చు, కాని, పుట్టరని తెలిస్తే ఎవరూ చేసుకోరేమో ?''

పిల్లలకోసమే పెళ్లా ?

ఈ సమస్య ఒక ఇంటిదా ? ఒక దేశపుదా ? లేక లోకమంతా ఇంతేనా ?

ఆమె తల గిర్రున తిరిగి నట్లవుతోంది.

మంచమ్మీద దొర్లుతున్నది.

దేవీప్రసాద్‌ని పినాకపాణిని గురించిన ఆలోచనలు ముసురుకుంటున్నాయి. ''సుబ్బాయమ్మ'' మనమడంటే శమంతకమణి కొడుకే. అందుకు సందేహంలేదు. తనే ఆమెకూతుర్ని హాస్పిటల్లో చేర్చాడు. ఆమె చనిపోయిందన్న వార్తవినగానే తానక్కడ ఉండలేకపోయాడు. బైట నిలబడ్డ సుబ్బాయమ్మతో ''మణి చనిపోయింది. ఆ పసికూన బతికి ఉంటే మీరు పెంచండి. నావల్ల కాదుగదా ?" అనుకుంటూ వెళ్ళిపోయాడు ఆ పోవటం పోవటం ఆరేళ్ళ తరువాత విదేశాలనుంచి వచ్చాడు. వచ్చినప్పటినుంచీ సుబ్బాయమ్మకోసం వెతుకుతున్నాడు. వెతికిస్తున్నాడు. అందరినీ అడుగుతున్నాడు. ఆమె ఆ ఊరినుంచి వెళ్ళిపోయిందని చెప్పేవారేగాని ఎక్కడ ఉన్నదీ చెప్పేవారు కనబడలేదు.

సంవత్సరాలు గడిచిపోతున్నాయి.

గాయం సెలలు లేస్తున్నట్టుగా ఉంటుందొక్కసారి.

చప్పున గతదినం సుమతి అన్నమాటలు జ్ఞాపకం వచ్చాయి.

''లోకం సంగతి పోనీయండి. మీకు పిల్లలు లేరు. మీరు పెంచుకుంటారా? లేక మళ్ళీ పెళ్ళిచేసుకుంటారా?''

''నా ప్రశంస ఇప్పుడెందుకు ?"

"సందర్భం వచ్చింది కనుక."

''నా సంగతి నాకే తెలియదు. ఆ మాట మర్చిపొమ్మన్నానుగా.''

సుమతి తన్ను అప్పుడప్పుడు ఆ మాటఎత్తి ఘర్షణకు దారితీస్తునే ఉంటుంది. తనే గంభీరంగా ఉంటున్నాడు.

పక్కమీదినుంచి లేచి గదిలో పచార్లు చేశాడు.

తను చెన్నపట్నం వెళ్ళి ఆరాతీస్తే ?

"ఆ రోగిమాటలు పట్టుకునా?"

''ఏమో, వెళ్ళి స్నేహితులను చూసి అందరినీ అడిగి చూస్తే?''

తనంతటి డాక్టరు గాలికబుర్లు పట్టుకుని అంతదూరం వెళ్తే నవ్వరూ ఎవరైనా ?"

సుమతి గదిలోకి తొంగిచూశాడు, ఆమె లేదు. గబగబా కిందికి దిగి వచ్చాడు.

''డాక్టరుగారూ. నాలుగయిందండి. బల్లమీద కాఫీ టిఫిన్ రెడీ.'' అన్నది సుమతి.

"నాకు నిద్రపట్టేసింది సుమా. నీవు లేపుతావనుకున్నాను.''

"మర్చిపోయాను. చేతికి గడియారం ఉందిగా ?"

"గడియారాలు లేని రోజుల్లో భార్యలే గడియారాలు."

కాఫీ సిప్ చేస్తూ ''ఇవాళ నా స్నేహితుడొకడు మద్రాసులో ఉన్నాట్ట,

రమ్మని రాశాడు. ఒకవారం హాలీడేగా వెళ్ళాలనుకుంటున్నాను. నర్సింగ్‌హోమ్‌ను అసిస్టెంటుకు అప్పగించాను. స్టాఫ్ అందరూ జాగ్రత్తగా చూసుకుంటామన్నారు. మరి నేను టికెట్ ఎప్పుడు కొనుక్కోను?'' అడిగాడు.

"నిజంగా మీకు హాలీడే అవసరమే. ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడే కొనుక్కోండి.''

"మరి, నీవు ఒంటరిగా ఉండగలవా? ఆయాలనిద్దరిని ఇక్కడ ఉండమని చెప్పనా?"

"ఎందుకు? నాకు భయమనా? లేక నామీద కాపలాకా?''

''అబ్బబ్బ, నీవు మొన్నటినుంచీ విరుపుమాటలు మాట్లాడుతున్నావు. ఎందుకోమరి? నీకు తోడుగా, పిలిస్తే పలకటానికి ఉంటారని అడుగుతున్నాను."

''అంత పిరికిదాన్ని కాను.''

''అన్నట్టు నీకు తోడుగా మన పనిమనిషే ఉంటుందిగా? రాత్రికూడా ఉండమంటే ఉండదూ?''

"అదా? అది పిల్లలతల్లి. సాయంత్రం ఆరుగంటలు కానివ్వదు. పోతా పోతా అంటూ ఉంటుంది. పొద్దున ఏడుగంటలయితే గాని పనిలోకి రాదు. ఈ పిల్లల తల్లులను పనికి పెట్టుకుంటే ఇదే గొడవ. మా హాస్పిటల్లోకూడా ఆయాలూ నర్సులూ సెలవులు పెడుతూ ఉంటారు.''

''సరే. నీ అనుకూలం చూసుకో" అంటూ బట్టలు మార్చుకున్నాడు. నర్సింగ్‌హోము సమీపించగానే రోగులు ఒక్కొక్కరే అతడి మనోవీధిలో బొమ్మ కట్టారు. నవ్వుకుంటూ కారుదిగి, అసిస్టెంటును వచ్చేవారానికి టికెట్ కొనమని పంపించి లోపలికి వెళ్లాడు.

కొందరు రోగులను డిస్చార్జి చేశాడు. కొందరికి కొత్తమందులు రాసిచ్చాడు. అందరితో నవ్వుతూ కబుర్లు చెప్పాడు. తను తిరిగి వచ్చేవరకూ గొడవ చెయ్యకుండా చిన్నడాక్టరు చెప్పినట్టు వినమన్నాడు.

అందరూ సంతోషంగా తలలూపారు.

ఇంటికి వచ్చాడు. తన లైబ్రరీ ఆవారంలో సర్దుకున్నాడు. తోటలో మాలి చేత పూలమొక్కలకు ఎరువులు వేయించాడు. లాన్ బాగానే ఉంది. మధ్య సిమెంటు బెంచీలను రిపేరు చేయించమని మాలికి చెప్పాడు. రాత్రుళ్లు కావలాగా గరాజి ముందు పడుకోమన్నాడు.

అతడు బయలుదేరేనాడు సుమతిచేత సెలవుపెట్టించాడు. ఆమె అతడిని రైలెక్కించింది.

ఆమె చెయ్యి ఊపుతుంటే అక్కడే కాలక్షేపంచేస్తూ కూర్చోక వారానికల్లా తిరిగి వచ్చెయ్యండి'' అంటుందనుకుని కిటికిలో తలపెట్టి చూస్తున్నాడు.

ఆమె నవ్వుతూ వెనక్కుతిరిగింది. రైలు ముందుకు నడిచింది.

నిజానికి మద్రాసులో అతడికి తెలసిన వాళ్లెవరూ లేరు. ఒక హోటల్లో దిగాడు. స్నానం కాఫీ టిఫిన్ ముగించుకుని టాక్సీలో ఒక కాలేజికి వెళ్లాడు.

అక్కడ నేరుగా ప్రిన్సిపల్ దగ్గరికి వెళ్ళి తను వచ్చినపని చెప్పాడు.

''పేరు పినాకపాణి, దాదాపు పద్దెనిమిదేళ్ళుంటాయి.''

''ఏం చదువుతున్నాడు ?''

"అదే సరిగా తెలియదు."

డిపార్టుమెంటు హెడ్సునడిగితే తెలుస్తుందనుకుంటాను. ఈ ప్యూను వాళ్ళ దగ్గరికి తీసుకువెళ్తాడు ప్రయత్నించి చూడండి." గంటకొట్టాడు ప్యూనుకోసం.

డాక్టరు దేవీప్రసాద్ ప్యూను వెంటవెళ్ళి అన్ని డిపార్టుమెంట్లు చూశాడు.

"ఎవరు చెబుతారు పినాకపాణిని గురించి?''

''సుబ్బాయమ్మ మనమడిని గురించి'' తనకు తెలియకుండా ఉండాలని ఇలా చేసిందా ? తను ఆమె దృష్టిలో అపరాధి.

మెడికల్ కాలేజికి వెళ్ళినప్పుడు తన స్నేహితుడు ప్రిన్సిపల్ పక్కనే కూర్చున్నాడు.

చిరకాలానికి కలుసుకున్న వాళ్ళు కావటంచేత ఇద్దరిలోను అనుకోని సంభ్రమము తబ్బిబ్బుచేసింది.

ఆ స్నేహితుడు దేవీప్రసాద్‌ని పరిచయం చేశాడు ప్రిన్సిపల్‌కి.

ప్రిన్సిపల్ కాఫీ తెప్పించాడు.

దేవీప్రసాద్ మాటల సందర్భంలో తను వచ్చిన పని చెప్పాడు.

"మనం మొదటిసంవత్సరం స్టూడెంట్సును చూసి తరువాత ముందుకు వెళ్దాం. నావెంట రా" అంటూ స్నేహితుడు తీసుకువెళ్ళాడు.

"ఇన్నాళ్ళకు మనం కలుసుకున్నందుకు సంతోషంగా ఉంది. అయితే ఎవరి పిల్లవాడు ఇతడు ?''

తన సోదంతా చెబుతూపోతే నవ్వులపాలవుతాడు. అసలు పిల్లవాడికా తనెవరో తెలియదు. తనూ పిల్లవాడిని కంటితో చూడలేదు.

''నేనిక్కడికి వస్తున్నానని తెలిసి 'మావాడక్కడున్నాడు, చూసిరండ'ని నర్సింగ్‌హోములో ఉన్న నా పేషంటు అడిగాడు. 'సరే చూస్తాను లెండి' అన్నాను.''

"ఇంతే కదా, నీవెక్కడ దిగావు ?"

''హోటల్లో."

"అదేం పని''

''నాకేం తెలుసు నీవిక్కడున్నావని ?"

''మాయింటికొచ్చేయ్ సామాను తీసుకుని"

కేంపసులో మొదట-ఫస్టియర్ క్లాసులోకి వెళ్ళారు. క్లాసు నడుస్తున్నది. లెక్చరర్‌ని బైటికి పిలిచి'' పినాకపాణి అనే విద్యార్థిని కొంచెం బైటికి పంపించండి. వాళ్ళ వాళ్లెవరో వచ్చారు చూడటానికి'' అన్నాడు స్నేహితుడు.

ఐదు నిమిషాలలో పినాకపాణి వచ్చాడు బయటికి.

అతడు సరిగ్గా సుబ్బాయమ్మ ఉన్నట్టే ఉన్నాడు. ముఖమ్మీద పడుతున్న క్రాప్‌ను పైకి తోసుకుంటూ తలఎత్తి ఆ యిద్దరినీ చూసి నమస్కారం చేశాడు.

"నీవేనా పినాకపాణి అనే స్టూడెంటువు ?" అడిగాడు దేవీప్రసాద్.

అవునన్నట్టు తలఊపాడు.

''ఎక్కడుంటావు బాబూ ?''

''హాస్టల్లోనండి ఈ బిల్డింగ్ వెనక హాస్టల్లో ఉంటున్నాను."

''మీఊరు చేపూరుపాలెమని ఆ ఊరివాళ్ళుకలిసి చెప్పారు. మాదికూడా ఒకప్పుడు ఆ ఊరే. నీవిక్కడికి వస్తున్నావని తెలిసి ఏంచేస్తున్నాడో ఎట్లా ఉన్నాడోచూసి రమ్మన్నారు. నేను ఒక స్నేహితుడినిచూసి వెళ్దామని వచ్చాను. అలాగే నిన్నుకూడా చూడాలని క్లాసులోనుంచి పిలిపించాను. ఏమనుకోకు."

పినాకపాణి దిగ్భ్రాంతిగా చూస్తున్నాడు.

చేపురుపాలెం తను వదిలిపెట్టిందెప్పుడోకూడా జ్ఞాపకంలేదు. అమ్మమ్మ పోయినతరువాత ఆమె చెప్పిన వివరాలతో ఆస్తి అమ్మివచ్చాడు.

చాలా నాజూకుగా ఉన్నాడు మనిషి. కాని కండలు తిరిగిన శరీరంలా లేదు. నవ్వినప్పుడు కళ్ళు చిన్నవిగా కనబడతాయి. పెదవుల కలయిక మారుతుంది. ముఖం ఆకర్షణీయంగా ఉన్నది. చిరునవ్వుతో మాట్లాడతాడు. ఇవేకాక తనదీ అనుకున్న భావంతో హృదయం నిండిపోయింది దేవీప్రసాద్‌కి. కళ్లతో చూస్తున్నాడు కడుపునిండిపోయేటట్టుగా కాని, నోటి నుంచిమాట రావటంలేదు.

"క్లాసులోకి వెళ్ళాలండీ !"

"బాబూ, నీతో చాలా మాట్లాడాలి. కాలేజి అయిన తరువాత సాయంత్రం కలుసుకోవటానికి వీలుంటుందా ? ఉంటే ఎక్కడ ?''

''హాస్టల్లో పిల్లలంతా ఉంటారు. మీరెక్కడుంటారు ?" ''నేను హోటల్లో దిగాను. అక్కడా సందడి ఎక్కువ. నీవు బీచ్‌కి రాగలవా ?''

పినాకపాణి తలఊపాడు వస్తానన్నట్టుగా.

''సాయంత్రం ఐదుగంటలకు రాగలవా ?''

పినాకపాణి అనుకోకుండానే తలఊపాడు. ఎవరో ఆత్మీయులను కలిసినట్టుగా ఉంది అతడికి.

సాయంత్రం బీచ్‌లో ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తున్న దేవీప్రసాద్‌ని కలుసుకున్నాడు పినాకపాణి.

"దారిలో టిఫిన్ తీసుకుని వచ్చేసరికి ఆలస్యమయిందండి. వార్డెన్‌కి చెప్పటానికి వెళ్ళటంలో కొంత ఆలస్యమైంది."

"పోనీలే మొత్తానికి వచ్చావు. అదే సంతోషం. నీకు మీ అమ్మమ్మ తప్ప ఎవరూ లేరా బాబూ ?"

"నా కెవరూ తెలియదండి.''

''మీ అమ్మమ్మ ఏమీ చెప్పలేదా ?''

"పుట్టగానే అమ్మ చనిపోయిందని చెప్పిందండి. నాన్న సంగతి అడిగితే దేశాలు పట్టిపోయాడన్నదండి. మరింకేమీ చెప్పలేదు. కాని తల్లిదండ్రులను గుర్తుంచుకోమని ఒక ఫోటో ఇచ్చిందండి. పెట్టెలో భద్రపరచుకున్నాను.''

''అలాగా, అదయినా దాచుకున్నావు. నాకు రేపు చూపిస్తావా ? నేనెక్కడయినా చూశానేమో మీనాన్నను ?"

"మీరేం చేస్తూ ఉంటారు ?''

''నేను విశాఖలో నర్సింగ్‌హోమ్ నడుపుతున్న సర్జన్ను. అప్పుడప్పుడు ఇలా బయలుదేరి నలుగుర్నీ కలుసుకుని పోతూ ఉంటాను."

''ఇంకెన్నాళ్ళుంటారండి?"

''ఇంకేం పనిలేదు. పోతాను రేపో ఎల్లుండో'' బీచ్‌లో గరంగరం బటానీలు వేరుసెనగ పప్పులు, ఉప్పునీళ్ళు చల్లి వేయించిన జీడిపప్పులూ అమ్ముతారు. అందరూ నములుతూ కబుర్లు చెప్పుకుంటారు. దేవీప్రసాద్ జీడిపప్పులుకొని పినాకపాణి దోసెట్లో కొన్ని పోశాడు.

''రేపే వెళ్ళిపోతారండీ''

"అఁ వెళ్ళాలనే ఉంది. మరి ఫొటో తీసుకువస్తానన్నావుకదా. మళ్లీ మనమెప్పుడు కలుద్దాం ?''

"సాయంకాలమే నాకు వీలండి. రేపుకూడా మీరుంటే చూపిస్తానండి.''

వేడుకుంటున్నట్టుగా ముఖంపెట్టాడు. ఆయనమీద ఏదో పేరు చెప్పలేని అభిమానం పుట్టుకొస్తోందతడికి.

''ఎందుకో-నీవు ఉండమనగానే ఉండాలనిపిస్తోంది. కాని- నా పేషంట్లు ఏడుస్తారని చూస్తున్నా. సరేలే ఉంటాను.''

చాలాసేపు మాట్లాడేడు పినాకపాణి. భవిష్యత్తులో తనకు విదేశాలకు వెళ్ళాలనున్నదట. ఆ దేశాలు తనకు నచ్చితే అక్కడే ఉండిపోతాడట. ''నాకెవరూ లేరు. ఏ దేశంలో ఉన్నా తలుచుకునే వాడులేడు" అన్నాడు.

''అలాగా ? పెద్దప్లాను వేసుకుంటున్నావన్నమాట !''

నవ్వాడు పినాకపాణి చెమర్చిన కళ్ళతో.

ఆ నవ్వునుచూసి మురిసిపోయాడు దేవీప్రసాద్.

"రేపు తప్పకుండారండి. నేనూ తొందరగానే వస్తాను. మావార్డెన్ భోజనం టైమ్‌కి ఉండాలన్నాడు వచ్చేటప్పుడు."

ఇద్దరూ లేచారు. దేవీప్రసాద్‌కి పెన్నిధి దొరికినట్లయింది.

పినాకపాణికి తనకొక శ్రేయోభిలాషి దొరికినట్లయింది.

మరునాడు మళ్ళీ అదేవేళకు ఇద్దరూ బీచ్‌లో కలుసుకున్నారు.

''మీరు వెళ్ళిపోతారేమోనని భయంవేసిందండి'' అన్నాడు కూర్చుంటూ పినాకపాణి.

"నీకు మాటయిచ్చిన తరువాత వెళ్తానా ? అందులో ఫోటో చూపిస్తానన్నావుకదా.''

''తెచ్చానండి ఎంతో జాగ్రత్తగా మాసిపోకుండా భద్రపరిచిందండి మా అమ్మమ్మ. దీన్ని చూసుకుని ఏడ్చేది." నీవు పెద్దవాడవయిన తరువాత మీ అమ్మా నాన్నను చూసుకో అనేది" అతడి చేతికిచ్చాడు.

అదిచూసిన దేవీప్రసాద్ ముఖం అదోలా మారిపోయింది. అతడి కళ్ళ నిండా నీళ్ళు. ఫోటోను గుండెకు ఆనించుకున్నాడు.

పినాకపాణి ఆశ్చర్యపడ్డాడు.

''మీకు ఆయన తెలుసాండీ ?''

''తెలియటమేకాదు ఇద్దరిదీ ఒకే ప్రాణం. ఒకచోటే చదువుకున్నాం. ఒక గదిలో ఉన్నాం. పెళ్ళికినన్ను పిలిచాడు, వెళ్లాను. చదువు ముగించుకుని విదేశాలకు వెళ్లాం. అక్కడ అతనొకదేశంలో నేనొకదేశంలో చదువుకున్నాం. ఉత్తరాలు రాసుకునేవాళ్ళం. ఒకసారి మనదేశానికి తిరిగివచ్చి ఏడాది ఉన్నాడు. ఉండి మళ్లీ హఠాత్తుగా నాదగ్గరకొచ్చి పదిరోజులున్నాడు. భార్య కడుపుతో ఉందిట బిడ్డపుట్టినతరువాత తనతో తీసుకురావాలనుకున్నాడట. ఆమె నెలలు నిండిన తరువాత హాస్పిటల్‌లో కని చనిపోయిందట. ఆ దుఃఖంలో పుట్టిన పిల్లవాడినయినా చూడకుండా ఆమె తల్లికా కబురుచెప్పి వచ్చేశాడట. చాలా దుఃఖపడ్డాడు. తిరిగి మామూలు మనిషవుతాడని నేననుకోలేదు. స్నేహితులందరం కలిసి ఎప్పుడు అతడిని కనిపెట్టుకుని ఉండేవాళ్లం. వేళకు భోజనం చేసేవాడుకాదు. చిక్కి శల్యమైనాడు. అందరం కలిసి అతడిని మామూలు మనిషిని చెయ్యటానికి ఏడాది పట్టింది. తను రీసర్చి చేసేచోట ఒక స్నేహితుడింట్లో ఉండేవాడట. వాళ్ళమ్మాయిని పెళ్ళిచేసుకుని ఆరేళ్ళతరువాత విశాఖపట్నం వెళ్లాడు. తరువాత కొంతకాలానికి నేనూ అక్కడికి చేరాను. ఇద్దరం చెరొక నర్సింగ్‌హోమ్ పెట్టుకున్నాం. ఈ ఫోటో మీ తల్లి పెళ్ళయిన తరువాత తీసుకున్నది. అప్పటికీ ఇప్పటికీ చాలా మార్పురాదూ మనిషిలో ?" కళ్ళు తుడుచుకున్నాడు.

''ఆయన ఎక్కడున్నారండీ !''

"చెప్పాగా ! మనదేశంలోనే ఉన్నాడు. విశాఖలో నర్సింగ్‌హోమ్ పెట్టుకుని. కాని— మనదేశం వచ్చిన తరువాత సుబ్బాయమ్మగారు అంటే మీ అమ్మమ్మ కోసం ఎన్నో ప్రయత్నాలు చేశాడు. ఎవరూ చెప్పలేకపోయారు. అందుకే చాలా బాధపడతాడు. పిల్లవాడు ఎక్కడున్నాడో ఏంచేస్తున్నాడోనని ఎప్పుడూ ఆలోచిస్తూ ఉంటాడు."

"నిజంగానా ? కాని మా అమ్మమ్మ ఆయనను గురించి ఇలా చెప్పలేదండి. ఆయననుగురించి ఎప్పుడైనా అడిగితే తిట్టిపోసేది- ''నాకూతురు చావుకు వాడే కారణమనేది.''

"అది నిజంకాదు బాబూ. మీ అమ్మంటే ఇప్పటికీ తలుచుకుని కన్నీళ్ళు

కారుస్తాడు. ఆ దుఃఖాన్ని మరిచిపోవటానికి ఎక్కువసేపు నర్సింగ్‌హోమ్‌లోనే ఉంటాడు."

"ఇన్నాళ్లనుంచీ నేను ఆ అపోహలోనే ఉన్నానండి. నాకిదంతా ఏంతెలుసు? నేను బతికి ఉన్నానని ఆయనకు తెలుసాండీ ?''

"ఎట్లా తెలుస్తుంది ? తెలియకుండా కట్టుదిట్టాలు చేసింది సుబ్బాయమ్మ గారు. ఆ ఊరినుంచి వెళ్ళిపోయిందట."

"అయ్యో, ఆయనకు నేను ఇక్కడఉండి మెడికల్ కాలేజిలో చదువుతున్నానని తెలియదన్నమాట !"

''తెలియదుబాబూ, తెలియదు. ఆయన మనసెరిగిన ఆత్మీయుడిని నేనొక్కడినే. తెలిస్తే నిన్నిక్కడ చదవనిస్తాడా ! ఆ ఊరు తీసుకువెళ్ళి చదివించడూ ? ఆయనకు పిల్లలంటే ఎంత ఇష్టమో చెప్పలేను.''

"మీరు ఆయననుగురించి ఇంతచెప్పిన తరువాత నాకూ ఆయనను చూడాలని ఉందండి".

''నాతో వస్తావా చూపిస్తా. ఆయన నిన్ను అసలే చూడలేదాయె. నీవూ అంతే.... అందుకని నేను చూపిస్తా వస్తావా ?"

''ఈ సంవత్సరం పరీక్షలు రాసివస్తాను. ఇంకా నెలకూడాలేదు. సెలవుల్లో వస్తా. మీరే స్టేషన్‌కిరావాలి. ఆయన నన్ను గుర్తుపట్టలేరుకదా ?''

''నీవు టెలిగ్రామ్ ఇవ్వు. నేనే స్టేషన్‌కివచ్చి నిన్ను ముందు మాయింటికి తీసుకువెళ్ళి స్నానం కాఫీ వగైరాలు అయిన తరువాత టెలిఫోను చేసివెళ్దాం. సరేనా ?''

"సరేనండి ఇంక లేద్దామా ? చదువుకోవాలండి." అన్నట్టు మీ ప్రయాణమెప్పుడు ?''

''నీ కబురు మీనాన్నకు చెప్పమన్నావుగా ? రేపు వెళ్తాను.''

తనజీవితంలో ఎవరూ ఇంతఆత్మీయంగా మాటాడలేదన్నట్టుగా ఆయనను కౌగలించుకున్నాడు పినాకపాణి.

"నన్ను చూస్తేనే ఇట్లా ఉందే నీకు ? ఇంకా మీనాన్ననుచూస్తే ఎట్లా ఉంటుందో ?" అంటూ వీపుమీద తట్టి "పద వెళ్దాం" అన్నాడు.

దేవీప్రసాద్ ఆ మరునాడు అమితానందంతో బయలుదేరి ఇల్లు చేరుకునేటప్పటికి నౌకరు ఒక ఉత్తరమిచ్చి "అమ్మగారు బొంబాయి వెళ్ళారండి. మీకి తాళాలు ఇవ్వమన్నారండి" అన్నాడు.

"హాస్పిటల్లో పని నాకు నచ్చలేదు. కాన్పులు, పిల్లలు, ఆ కేసులుచూసి ప్రాణం విసిగిపోయింది. మీకు పిల్లలంటే ఎంత ఇష్టమో రోజూ మీమాటలతో బోరెక్కిస్తున్నారు. పైగా స్త్రీకి మాతృత్వమే పరిపూర్ణత నిస్తుందన్నారు. నాకా మాట బొత్తిగా వ్యతిరేకం. మనం విడిపోతేనే బాగుంటుందనిపించింది నేను మావాళ్ళదగ్గరికి వెళ్ళిపోతున్నాను." ఇంకా ఏమిటేమిటో అతడి దగ్గరున్నలోపాలు ముఖ్యంగా 'నర్సింగ్‌హోమ్- రోగులు తప్ప మరొక సరదా సంతోషమూ లేని మనిషట.' వంటివి రెండు పేజీలు రాసింది.

దేవీప్రసాద్ చదువుకుని గాఢంగా నిట్టూర్చాడు.

ఒకటి దొరికితే- మరొకటి జారిపోయింది.

జీవితమంటే ఇదే కాబోలు ననుకుంటూ, నౌకర్ని తలుపు తాళం తీయమన్నాడు.